వార్త

శుక్రవారం 17 జూలై 2026

I

తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

## గణనాధుని సన్నిధిలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ జాయింట్ డైరక్టర్

కాణిపాకం, జూలై 16 ప్రభాతవార్త:



జాతీయ మానవ హక్కుల కమీషన్ జాయింట్ డైరక్టర్ దేవేంద్రకుమార్ నిమ్ గురువారం కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామి వారి సేవలో పాల్గొన్నారు. వారికి ఆలయ వేద మండపంలో ఆశీర్వచననం చేసి స్వామివారి శేషవస్త్రాలను, చిత్రపటాన్ని అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ సూపరెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడు, స్థానిక ఎస్సై నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## తాతయ్యగుంట గంగమ్మ ఆలయ
## అభివృద్ధి పనులకు భూమిపూజ

తిరుపతి, జులై 16ప్రభాతవార్త:



తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు గురువారం భూమిపూజ నిర్వహించారు. టిటిడి బోర్డు సభ్యురాలు పనబాక లక్ష్మి పాల్గొన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ ప్రాంగణంలో అవసరమైన మౌలిక వసతులు, సౌకర్యా లను విస్తరించే దిశగా ఈ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఆలయాల ఆధ్యాత్మిక వైభవాన్ని కాపాడుతూ, భక్తులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తోందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఆలయ అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు భక్తులు పాల్గొన్నారు.

## కన్నుల పండువగా
## శ్రీజగన్నాథుని రథయాత్ర



సూళ్లూరుపేట, జూలై 16, ప్రభాతవార్త

నెల్లూరు ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో సూళ్లూరుపేటలో శ్రీ జగన్నాథ్‌ని రథయాత్రను గురువారం కన్నులు పండువగ నిర్వహించారు. సూళ్లూరుపేటలో నాలుగోసారి నిర్వహిస్తున్న ఈ రథయాత్రను స్థానిక షార్బస్టాండ్ వద్ద నుంచి ప్రారంభించారు. భక్తుల హరే రామ హరే కృష్ణ సంకీర్తనతో, భజనలు, కోలాటాలు, నడుమ పట్టణ పురవీధుల గుండా రథయాత్ర కొనసాగింది. నెల్లూరు ఇస్కాన్ సంస్థ నిర్వాహకులు సుఖదేవ్ మహారాజ్, సూళ్లూరుపేట నిర్వాహకులు రమణారెడ్డి ఆధ్వర్యంలో రథయాత్ర ఆద్యంతం ఉత్సాహంగా కొనసాగింది. పట్టణ ప్రజలు హారతులు ఇస్తూ పాదయాత్రను స్వాగతించారు. అనంతరం రథయాత్ర శ్రీ చంగాలమ్మ దేవస్థానం సమీపంలోని శ్రీనగర్ కాలనీలో ముగిసింది. ఈ సందర్భంగా పలువురు, వక్తలు ప్రసంగిస్తూ కృష్ణ తత్వాన్ని బోధిస్తూ దేవుడు, దేవతామూర్తులు ఉన్నారన్న నమ్మకాన్ని ప్రజల్లో కల్పించేందుకే ఈ రథయాత్రను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఒరిస్సాలోని పూరి జగన్నాథ రథయాత్ర జరుగుతున్న రోజే ఈ రథయాత్రను చేపట్టడం విశేషమని వారు చెప్పారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. నాయుడుపేట డిఎస్పి చెంచు బాబు ఆధ్వర్యంలో సిఐఎం మురళీకృష్ణ, ఎస్సై అజయ్ కుమార్, తడ సై కొండప నాయుడు, శ్రీహరికోట ఎస్సై భాను ప్రసన్న పోలీసులు సిబ్బంది అటు దిట్టమైన భద్రత ఏర్పాట్లను చేపట్టారు.

## భూ వివాదానికి పరిష్కారం చూపడమే ప్రభుత్వ లక్ష్యం

### జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్



తిరుపతి కలెక్టరేట్, జూలై 16 ప్రభాతవార్త :

అవిలాల గ్రామానికి సంబంధించిన దశాబ్దాల నాటి భూ వివాదానికి శాశ్వత పరిష్కారం చూపడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ స్పష్టం చేశారు. అవిలాల గ్రామ భూ సమస్యలపై జిల్లా కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన ప్రత్యేక సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, తిరుపతి రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) రామ్మోహన్, రెవెన్యూ, ఎండోమెంట్స్ శాఖల అధికారులు, కొచ్చి కుటుంబ ప్రతినిధులు, అవిలాల గ్రామ బాధితులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లాల్లో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను ప్రాధాన్యంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. ఆ ఆదేశాల మేరకు తిరుపతి జిల్లాలో సంవత్సరాలుగా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న భూ సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. ఎండోమెంట్స్ శాఖ నుంచి ఉత్తర్వులు వచ్చిన వెంటనే అవిలాల భూ సమస్యపై జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయి అధ్యయనం ప్రారంభించిందన్నారు. జిల్లాలో 22 ఏ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని కలెక్టర్ తెలిపారు. భూములు కొనుగోలు చేసిన వేలాది మంది ప్రజలు రిజిస్ట్రేషన్, క్రయవిక్రయాలు చేయలేక ఎన్నో సంవత్సరాలుగా ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. శెట్టిపల్లి ప్రాంతంలో సుమారు 50 సంవత్సరాలుగా కొనసాగిన సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి 2,100 మంది లబ్ధిదారులకు 225 ఎకరాలపై ఇంటి స్థలాల పట్టాలు, ఉచిత రిజిస్ట్రేషన్ పత్రాలు అందించామని తెలిపారు. దామినేడు ప్రాంతంలో ప్రభుత్వ భూములను పరిరక్షిస్తూ న్యాయస్థానాల్లో ప్రభుత్వం విజయాన్ని సాధించిందన్నారు. సుమారు 100 ఎకరాల ప్రభుత్వ భూమిని అంతర్జాతీయ క్రీడా సముదాయం, జిల్లా కోర్టు సముదాయం, పర్యాటక అభివృద్ధి వంటి ప్రజా అవసరాలకు కేటాయించినట్లు వివరించారు. అదే సమయంలో దామినేడు ప్రాంతంలో 240 ఎకరాలకు సంబంధించిన మరో సమస్యపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని, సుమారు 1,400 మంది కొనుగోలుదారులకు సంబంధించిన భూములను 22ఏ నుంచి విముక్తి కల్పించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఆటోనగర్ ప్రాంతంలో కూడా 22ఏ కారణంగా ఇబ్బందులు ఎదుర్కొన్న సుమారు 500 కుటుంబాలకు ప్రభుత్వం న్యాయం చేస్తూ విముక్తి కల్పించిందన్నారు. అవిలాల భూ సమస్యపై మాట్లాడుతూ, 1884 కాలం నుంచి జరిగిన భూ లావాదేవీలు, న్యాయపరమైన అంశాలు, ప్రభుత్వ రికార్డులను సమగ్రంగా పరిశీలిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఉత్తరాది మఠం, హాథీరాంజీ మఠం, కొచ్చి కుటుంబానికి సంబం ధించిన భూములపై ఎండోమెంట్స్ శాఖ మార్గదర్శకాల మేరకు సమగ్ర సర్వే నిర్వహిస్తున్నామని చెప్పారు. సుమారు 175 ఎకరాల పరిధిలో హాథీరాంజీ మఠానికి చెందిన భూములకు సంబందించిన, కొచ్చి కుటుంబానికి చెందిన భూములు సంబందించిన అంశాన్ని ఖచ్చితంగా నిర్ధారించిన తర్వాత చట్టబద్ధమైన నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. అవిలాలలో అనేక మంది తమ జీవితకాల పొదుపులతో స్థలాలు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకున్నారని, వారి ఇబ్బందులను ప్రభుత్వం పూర్తిగా అర్థం చేసుక సమావేశంలో సుమారు 20 మంది బాధితులు తమ అభిప్రాయాలు వెల్లడించారని, అందరి సమస్యలను ఓర్పుతో విన్నామని తెలిపారు. ప్రభుత్వ ఉత్త ర్వుల ప్రకారం సంబంధిత భూముల్లో 50 శాతం హాథీరాంజీ మఠానికి, 50 శాతం కొచ్చి కుటుంబా నికి చెందినవిగా గుర్తింపు ఉన్న నేపథ్యంలో అదే ప్రాతిపదికన తదుపరి చర్యలు చేపడతామని తెలిపారు. ఈ అంశంపై జిల్లా ఎస్పీతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, న్యాయపరమైన కేసులు, శాంతిభద్రతల అంశాలను సమన్వయంతో

## ఆగమోక్తంగా
## కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

### నేటి నుండి కళ్యాణ వెంకన్న సాక్షాత్కార వైభవోత్సవాలు



చంద్రగిరి, జూలై 16 ప్రభాతవార్త:

శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో గురువారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఆగమోక్తంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వేకువజామున స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి తోమాల, కొలువు, పంచాంగశ్రవణం నిర్వహించారు. ఈ నెల 17 నుండి 19 వరకు ఆలయంలో సాక్షాత్కార వైభవోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఉదయం 6 గంటల నుండి 11.30 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం (ఆలయశుద్ధి) నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజా సామగ్రి, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలిగడ్డ, తదితర సుగంధ ద్రవ్యాల మిశ్రమంతో కూడిన పవిత్ర జలాలతో ఆలయం అంతటా ప్రోక్షణం గావించారు. మధ్యాహ్నం 12.30 గంటల నుండి భక్తులను దర్శనానికి అనుమతించారు. సాక్షాత్కార వైభవోత్సవాలలో భాగంగా 17న పెద్ద శేష వాహనం, 18న హనుమంత వాహనం, 19న గరుడ వాహనంపై స్వామి వారు రాత్రి 7 నుండి 8 గంటల వరకు ఆలయ మాడవీధులలో విహరించి భక్తులను అనుగ్రహించనున్నారు. కోయిల్ ఆళ్వార్ తిరుమంజన సేవను పురస్కరించుకుని తిరుపతికి చెందిన భక్తుడు నరశింహులు స్వామి వారికి పరదాలు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ యం.గోపినాథ్, సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, టెంపుల్ ఇన్స్‌స్పెక్టర్ ద్వారక మునికుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## చిత్తూరు జనసేనలో
## కోల్డ్‌వార్!



చిత్తూరు, జులై 16 ప్రభాతవార్త:

కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్య పార్టీగా వున్న జనసేన నాయకుల మధ్య చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో కోల్డ్‌వార్ నడుస్తోంది. చిత్తూరు జనసేన నాయకులుగా చెలామణి అవుతున్న ఇద్దరు నియకులు ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకోవడంతో పార్టీ పరువు బజారున పడిందని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పేర్కొంటున్నారు. చిత్తూరు జనసేన నాయకురాలు ఆరణి కవిత ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి సొంత పార్టీలోనే తనపై కొంతమంది నాయకులు తనపై కక్షకట్టి అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఆపై ఆమెతో వివాహం జరిగి అనంతరం విడిపోయిన భర్త సైతం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి జనసేన నాయకులు ఆరణి కవితపై ఆరోపణలు చేశారు. ఈ క్రమంలో చిత్తూరు జనసేన కార్యాలయంలో గురువారం జిల్లా జనసేన కార్యదర్శి యశ్వంత్ గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి చిత్తూరు జనసేన నాయకురాలు ఆరణి కవితపై ధ్వజమెత్తారు. చిత్తూరు జనసేన నాయకురాలు ఆరణి కవిత పార్టీ ప్రతిష్టను వ్యక్తిగత స్వార్థం కోసం వాడుకుంటోందని ఆరోపించారు. భార్యభర్తల మధ్య నెలకొన్న వివాదం మధ్య జనసేన పార్టీపై లేనిపోని నిందలు వేయడం పద్ధతి కాదన్నారు. జనసేన నాయకురాలు ఆరణి కవిత, ఆమె భర్త చంద్రమౌళి వ్యక్తిగత కారణాలతో విడిపోవడం జరిగిందని, వీరి మధ్య వివాదాలు వున్న సమయంలో బలిజ సంఘం నాయకులు మధ్యవర్తితం చేశారని గుర్తు చేశారు. ఈ మేరకు రాజీ కుదరడంతో ఆమెకు చెందాల్సి న ఆస్తులకు అందించడం జరిగిందని, పంచాయతీ ఒప్పందం మేరకు అరణి కవిత భర్త చంద్రమౌళి కేసులను ఉపసంహారించుకోగా, చంద్రమౌళిపై వున్న కేసులను మాత్రం ఆరణి కవిత ఉపసంహారించుకోవడం లేదన్నారు. చిత్తూరులో జనసేన నాయకుల వ్యవహారాలపై పార్టీ అధిష్టానంకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపారు. అలాగే వ్యక్తిగత విషయాలను జనసేన పార్టీపై రుద్దడం నాయకులకు పద్ధతి కాదన్నారు. సమావేశంలో జనసేన నాయకులు పూల చందు, సంతోష్, పవన్, కెఎం కుమార్, వెంకటేష్, నగర జనసేన అధ్యక్షుడు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టుబడిన
## ఒంటరి ఏనుగు పేరు కేశవ

### : సబ్‌డిఎఫ్ఓ వేణుగోపాల్

పలమనేరు, జూలై 16 ప్రభాతవార్త:



పలమనేరు మండలం జగమర్ల అటవీ ప్రాంతంలో పట్టుబడిన ఒంటరి ఏనుగుకు కేశవ అని నామకరణం చేసినట్లు పలమ నేరు అటవీశాఖ సబ్ డిఎఫ్ఓ వేణుగోపాల్ తెలిపారు. గురు వారం స్థానిక అటవీశాఖ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. నెలల తరబడి ముప్పుతిప్పలు పెట్టిన ఈ ఏనుగు తమిళనాడు సరిహద్దులో గుంపు నుండి విడిపోయిందని తెలిపారు. 6 నెలల క్రితం అటవీశాఖ అధికారి సుకుమార్‌పై కీలపట్ల రహదారి వద్ద దాడిచేసింది కూడా ఈ ఏనుగేనని వివరించారు. గతంలో రెండు ఏనుగులు మొగిలిఘాట్ జగమర్ల అటవీ ప్రాంత పరిసరాల్లో ప్రమాదవశాత్తు మృతిచెందాయని ఆ గ్రూపుకు చెందిన ఏనుగు కావడంతో ప్రతీకారం తీర్చుకోవడానికి తరచూ ఇక్కడకు వచ్చి తిరుగుతోందన్నారు. ఏనుగును లొంగ దీసుకోవడం ప్రమాదకరం కావడంతో ఈ నెల 15న కుంకీ ఏనుగుల సహకారంతో ఆపరేషన్ టస్కర్ పేరుతో గాలింపు చర్యలు చేపట్టామని పబ్లిక్‌ను మీడియాను అనుమతించలేదని తెలిపారు. పట్టుబడిన ఏనుగు కొత్త జీవితం ప్రారంభమైందని దాదాపు 6 నెలలు పాటు శిక్షణ ఇచ్చి దారిలోకి తెచ్చుకోవాల్సి ఉంటుందన్నారు.

## అర్హత వున్న ప్రతి ఒక్కరి ఓటు హక్కు రద్దు కాకుండా చర్యలు

### వేగవంతంగా రీ-వెరిఫికేషన్ - ఎన్నికల కమిషన్ సిఇఓకు వివరించిన కలెక్టర్

చిత్తూరు, జులై 16 ప్రభాతవార్త:

జిల్లాలో జరుగుతున్న 'సర్' కార్యక్రమంలో అర్హత వున్న ప్రతి ఒక్కరి ఓటు హక్కు రద్దు కాకుండా పక్కాగా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్ రాష్ట్ర ఎన్నికల కమిషన్ సిఇఒ వివేక్ యాదవ్‌కు వివరించారు. అమరావతి నుండి రాష్ట్ర ఎన్నికల కమీషన్ సిఇఓ వివేక్‌యాదవ్ గురువారం కలెక్టర్లతో 'సర్' పొడిగింపు, రీ-వెరిఫికేషన్ అమలుపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్‌లోని నాగార్జున వీడియో కాన్ఫరెన్స్ నుండి ఈ కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ సుమిత్‌కుమార్ హాజరయ్యారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వివరిస్తూ జిల్లాలో మ్యాపింగ్ లేని వారు 53,166 మంది వున్నారని, అలాగే చెన్నై, బెంగళూరు నగరాలతో పాటు ఇతర రాష్ట్రాలకు వలస వెళ్ళిన వారు 4 శాతం మంది వున్నారని, అలాగే ఎన్నికల కమీషన్ నియమ నిబంధనల మేరకు 41,730 మంది మృతి చెందిన వారి పేర్లను ఓటర్ల జాబితా నుండి తొలగించడం జరిగిందన్నారు. బూత్ స్థాయి అధికారులు(బిఎల్‌ఓ)లు ప్రతి కేసును నిబంధనలకు అనుగుణంగా పరిశీలించి, అర్హులైన ఓటర్ల వివరాలను సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించడం జరిగిందన్నారు. అర్హత కల్గిన ఏ ఒక్కరి ఓటు హక్కు రద్దు కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. బిఎల్‌ఓలు ప్రతి ఇంటికి మూడు సార్లు వెళ్ళి సమాచారం సేకరిస్తున్నారన్నారు. అలాగే జిల్లాలో 17,991 మంది డూప్లికేట్ ఓటర్లను గుర్తించి జాబితా నుండి తొలగించడం జరిగిందన్నారు. డబల్ ఎంట్రీలు, మృతి చెందిన వారి పేర్లను ఓటర్ల జాబితా నుండి ఎన్నికల కమీషన్ నిబంధనల మేరకు పరిశీలించి తొలగించామన్నారు.

## శ్రీ వసుకోటి
## ఎల్లమ్మ ఆలయంలో చోరీ



చంద్రగిరి, జూలై 16 ప్రభాతవార్త:

శ్రీనివాస మంగాపురంలోని శ్రీ వసు కోటి ఎల్లమ్మ వారి ఆలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. ఎస్ఐ అరుణాచలం వివరాల మేరకు.. ఆలయ పెద్దల ఫిర్యాదుతో గురువారం అమ్మవారి ఆలయాన్ని పరి శీలించిన ఎస్ఐ చోరీకి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆల యం వెనుక భాగంలో నిర్మాణ పనులు జరుగుతున్నట్లు వెళ్ళడించారు. ఈ మార్గంలోని గేటు తాళాలను పగులగొట్టి నిందితులు లోనికి ప్రవేశించినట్లు తెలిపారు. హుండీని పగులగొట్టి అందులోని నగదును, అదేవిధంగా మినరల్ వాటర్ ప్లాంట్ కాయిన్ బాక్స్‌ను, అమ్మవారి మెడలోని 12.5 గ్రాముల బంగారు తాళిబొట్టును దోచుకుపోయినట్లు తెలిపారు. క్లూస్ టీమ్ వేలిముద్రలు సేకరించినట్లు తెలిపారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

## నేడు ఆణివార ఆస్థానం

### -సాయంత్రం పుష్ప పల్లకీసేవ

తిరుమల, జులై 16ప్రభాతవార్తప్రతినిధి:

కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామికి నేడు సాలకట్ల ఆణివార ఆస్థానం పర్వదినం జరుగనుంది. సాధారణంగా ప్రతి సంవత్సరం సౌరమానం ప్రకారం దక్షిణాయన పుణ్యకాలంలో కర్కాటక సంక్రాంతినాడు ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. సౌరమానాన్ని అనుసరించే తమిళుల కాలమానం ప్రకారం ఆణిమాసం చివరి రోజున నిర్వహించే కొలువు కావడంతో ఆణివార ఆస్థానం అని పేరు. పూర్వం మహంతులు దేవస్థాన పరిపాలనను స్వీకరించిన రోజు అయిన ఈ ఆణివార ఆస్థానం పర్వదినంనాటి నుండి టిటిడి ఆదాయ వ్యయాలు, నిల్వలు తదితర వార్షిక లెక్కలు ప్రారంభమయ్యేవి. ఆ తరవాత టిటిడి ధర్మకర్తల మండలి ఏర్పాటుతో వార్షిక బడ్జెట్‌ను మార్చి - ఏప్రిల్ నెలకు మార్చారు.

**-ఉత్సవ విశిష్టత :**

ఆణివార ఆస్థానం ఉత్సవం రోజు నేటి ఉదయం 7 గంటలకు బంగారువాకిలి ముందు గల ఘంటా మండపంలో సర్వభూపాల వాహనంలో ఉభయదేవేరులతో మలయప్పస్వామి గరుత్మంతునికి అభిముఖంగా కొలువుకు వేంచేపు చేస్తారు. మరో పీఠంపై స్వామివారి సర్వసైన్యాధ్యక్షుడైన విష్వక్సేనులవారు దక్షిణాభిముఖంగా వేంచేపు చేస్తారు. ఈ ఉత్సవమూర్తులతో పాటు ఆనందనిలయంలోని మూలవిరాట్టుకు ప్రత్యేకపూజలు, ప్రసాదాలు నివేదిస్తారు. తిరుమల పెద్ద జీయ్యర్ స్వామి పెద్ద వెండితట్టలో ఆరు పెద్ద పట్టువస్త్రాలను తలపై పెట్టుకుని మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా విచ్చేస్తారు. వీటిలో నాలుగు పట్టువస్త్రాలను మూలమూర్తికి అలంకరిస్తారు. మిగిలిన రెండు వస్త్రాలలో ఒకటి మలయప్పస్వామికి, మరొకటి విశ్వక్సేనులకి అలంకరిస్తారు. శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకుడు తలకు శ్రీవారిపాదవస్త్రంతో వరిపట్టం కట్టుకుని స్వామివారి ద్వారా బియ్యపు దక్షిణ స్వీకరించి నిత్యైశ్వరోభం అని స్వామిని ఆశీర్వదిస్తారు. ఆ తరువాత అర్చకులు పెద్దజీయర్, చిన్నజీయర్‌స్వామికి, టిటిడి ఈఓ చేతులకు లచ్చన తాళపు చెవిగుత్తిని వరుసక్రమంలో కుడిచేతికి తగిలిస్తారు. హారతి, చందనం, తాంబూలం, తీర్థం, శఠారి మర్యాదలు చేసి తాళపు గుత్తిని స్వామివారి పాదాలచెంత ఉంచుతారు.



**-పుష్ప పల్లకీ:**

ఆణివార ఆస్థానం సందర్భంగా నేటిసాయంత్రం 6 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి అత్యంత శోభాయమానంగా అలంకరించిన పుష్పపల్లకీపై ఆలయ మాఢవీధుల్లో విహరిస్తూ భక్తులకు కనువిందు చేస్తారు. ఇందుకోసం టన్ను పుష్పాలను తమిళనాడు చెన్నై దాత పుష్పాలను విరాళంగా ఇచ్చారు. నేడు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టిటిడి రద్దు చేసింది.

## సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత



కుప్పం, జూలై 16 ప్రభాతవార్త

మండలంలోని కొటాలూరు పంచాయతీలో అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన 3.35లక్షల చెక్కులను గురువారం లబ్ధిదారులకు నాయకులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బాధితులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. లబ్ధిదారులకు ఈసందర్భంగా మాట్లాడుతూ తమకు ఆపన్నహస్తం అందించిన సిఎం చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు రాజే ం ద్రన్, సంజీవరాజులునాయుడు, ఐటిడిపి అధ్యక్షుడు గుణశేఖర్, పార్టీ అధ్యక్షుడు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## మహిళా స్టేషన్ డిఎస్పీగా శ్రీనివాసరావు

చిత్తూరు, జులై 16 ప్రభాతవార్త:



చిత్తూరు మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పీగా శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు మహిళా పోలీస్ స్టేషన్‌లో ఇన్స్‌పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావుకు ఇటీవల డిఎస్పీగా పదోన్నతి లభించింది. ఈ మేరకు చిత్తూరు మహిళా పోలీస్ స్టేషన్‌లో ఇన్స్‌పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావును ప్రభుత్వం అదే పోలీస్ స్టేషన్‌లో ఖాళీగా వున్న డిఎస్పీ స్థానంలో నియమించింది. ఈ మేరకు గురువారం చిత్తూరు మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పీగా శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఎస్పీ తుషార్ డూడిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

## ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

పెనుమూరు, జులై 16 ప్రభాతవార్త:



విద్యార్థులు ఇప్పటి నుండి ఆరోగ్యం పట్ల ప్రత్యే క శ్రద్ధ వహించాలని పిహెచ్‌సి డాక్టర్ హర్ష వర్ధన్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థులకు ఉచిత ఆరోగ్య, వైద్య, కంటి చికిత్స శిబిరం నిర్వ హించారు. ఈ శిబిరా నికి హాజరైన డాక్టర్ హర్షవర్ధన్ మాట్లాడుతూ ప్రస్తుత విద్యార్థులు ఆరోగ్య సమస్యలపై తప్పనిసరిగా చికిత్సలు చేయించుకోవాలన్నారు. విద్యార్థులకు చిన్న వయస్సులోనే బిపి, షుగర్ లాంటి జబ్బులు వుస్తున్నాయని, మంచి పోషకాహారం తీసుకుంటే ఇలాంటి వ్యాధులు విద్యార్థుల జోలికి వచ్చే అవకాశం వుండదన్నారు. డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి కొంతమంది విద్యార్థులు డ్రగ్స్‌కు అలవాటు అవుతున్నారని, స్వల్ప సుఖం కోసం చెడు వ్యసనాలకు విద్యార్థులు బానిసలు అవుతున్నారన్నారు. గైనకాలజిస్ట్ డాక్టర్ సౌమ్య మాట్లాడుతూ బాలికల ఆరోగ్య, రుతుక్రమ సమస్యలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థినిలకు వివరించారు. ఈ కళాశాల ప్రిన్సిపల్ శారద, ఎస్ఎస్ఎస్ పిఒ ప్రసాద్, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు నిత్యవసర వస్తువులు పంపిణీ

బంగారుపాళ్యం, జులై 16 ప్రభాతవార్త:




రోప్ సంస్థ ఆధ్వర్యంలో పి4 కార్యక్రమంలో భాగంగా నిరుపేదలకు ఉచితంగా నిత్యవసర వస్తువులను అందజేశారు. గురువారం మండలంలోని కోళ్ళవారివూరు, గౌరి నారాయణపురం ఎస్టీ కాలనీల్లో వున్న నిరుపేద కుటుంబాలకు ఉచితంగా నిత్యవసర వస్తువులను అందజేశారు. జపాన్ ఎన్వైకె సహకారంతో బియ్యం, కందిపప్పు, నూనె, వేరుసెనగ, శానిటరీ ప్యాడ్స్, దుప్పట్లు తదితర వస్తువులను అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ జడ్జి భారతి, రోప్ సంస్థ అధ్యక్షులు ధనశేఖర్, డైరెక్టర్ శ్రీలత, జపాన్ దేశ ప్రతినిధులు, డిప్యుటీ తహసిల్దారు బాబు, ఎఎస్ఐ వెంకటేష్, ఆర్ఐ రుషి, ఎంఇఓ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

## విద్యుత్ షాక్‌తో కార్మికుడు మృతి

బంగారుపాళ్యం, జులై 16 ప్రభాతవార్త:



యాదమరి మండలం మోర్దానపల్లి సమీపంలోని ఓ బ్యాటరీ ఫ్యాక్టరీలో గురువారం జరిగిన విద్యుత్ షాక్‌తో కార్మికుడు మృతి చెందాడు. ఇతను బంగారుపాళ్యం మండలం రాగిమానుపెంట గ్రామంకు చెందిన చైతన్య( 32)గా గుర్తించారు. ఫ్యాక్టరీలో చైతన్య పని చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురి కావడంతో అతను అక్కడిక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి గల కారణా లు, ఫ్యాక్టరీలో భద్రతపై చర్యలు, తదితర అంశాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. బంగారుపాళ్యం పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కత్తి శ్రీనివాసులు కేసు నమోదు చేసి మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## ఎమ్మెల్యేకు ఆర్టీసీ ఉద్యోగ సంఘాల జెఎసి వినతి

పలమనేరు, జూలై 26, ప్రభాతవార్త:




పలమనేరు ఆర్టీసీ డిపో ఉద్యోగ సంఘాల జెఎసి నాయ కులు గురువారం ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని ఆయన నివా సంలో కలిశారు. దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న తమ సమ స్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. పలమనేరు డిపోలో 72 బస్సులుండగా ఇందులో దాదాపు 60 బస్సులు పల్లె వెలుగు బస్సులేనన్నారు. మిగిలిన వాటిలో కొన్ని ఎక్స్‌ప్రెస్ బస్సులుగానూ, సూపర్‌డీలక్స్ బస్సులుగానూ తిరుపతి, బెంగళూరు, మంత్రాయలం, అనంతపురం వంటి దూర ప్రాంతాలకు వెళుతుంటాయని తెలిపారు. ఎక్స్‌ప్రెస్ బస్సులు తక్కువ కావడంలో డిపో ఆదాయం తగ్గిపోయిందన్నారు. ఇక పల్లెవెలుగు బస్సుల్లో ఉచిత ప్రయాణం వల్ల తగిన ఆదాయం రావడం లేదన్నారు. డిపోలో కొత్తగా ఎలక్ట్రానిక్ బ్యాటరీ బస్సులు ప్రవేశపెట్టాలని, హైదరాబాద్, విజయవాడ, పళని, చెన్నై, బెంగళూరు, సేలం వంటి దూర ప్రాంతాలకు సూపర్‌డీలక్స్ బస్సులు, అంతర్రాష్ట్ర సర్వీసులు ప్రవేశపెట్టాలని విన్నవించారు. అన్ని క్యాటగిరీల్లో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, రిపేరు అయిన బస్సులకు సకాలంలో విడిభాగాలు సరఫరా చేయాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి తెస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం త్వరలో సోలార్ సిస్టమ్ బస్సులు కూడా ప్రవేశపెట్టే యోచనలో ఉందని తెలిపారు. జెఎసి నాయకులు ఉపేంద్ర, బలరామ్మూర్తి, భాస్కర్, యాగంరెడ్డి, నూర్‌బాషా, బాలక్రిష్ణ, రత్నం, కెఎస్ బాబు, మోహన్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## షైనింగ్ స్టార్ అవార్డు అందుకున్న విక్టరీ హైస్కూల్ విద్యార్థి

రైల్వేకోడూరు రూరల్, జులై 16 ప్రభాతవార్త

రైల్వేకోడూరు పట్టణంలోని విక్టరీ హైస్కూల్‌కు చెందిన ఎస్.మహమ్మద్ అష్రాఫ్ విద్యార్థికి రాష్ట్ర ప్రభుత్వం పదవ తరగతి మార్కుల ఉత్తీర్ణతల్లో ఏడవ ర్యాంకు వచ్చిన సందర్భంలో రాష్ట్ర ప్రభుత్వం షైనింగ్ స్టార్ అవార్డు ఎంపికైన విషయం విధితమే. ఈ నేపథ్యంలో ఈ అవార్డు కింద ఇరవై వేల రూపాయల నగదును, మొమెంటు సర్టిఫికెట్‌ను కూడా విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా అందుకోనున్నారని విక్టరీ స్కూల్ అధినేతలు నరసింహారెడ్డి, రామకృష్ణారెడ్డిలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ మొహమ్మద్ అష్రాఫ్‌ను పాఠశాల సిబ్బంది ఘనంగా అభినందించారు.

## జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులకు ఘనసత్కారం



కుప్పం, జూలై 16 ప్రభాతవార్త

చిత్తూరు పార్లమెంట్ పరిధి కుప్పం నియోజకవర్గంకు చెందిన పలువురికి జిల్లా కాంగ్రెస్ కమిటీలో చోటు లభించింది. జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులుగా నలగాంపల్లికి చెందిన జయప్రకాష్, రామకుప్పం మండలం రోహిణప్ప నియమితులయ్యారు. అలాగే రామకుప్పంకు చెందిన సుబ్రమణ్యం, కుప్పంకు చెందిన గౌహర్ ప్రధ్యాన కార్యదర్శులుగా, జాయింట్ కార్యదర్శిగా రామకుప్పంకు చెందిన అబ్దుల్ ఖయ్యూం, కార్యదర్శిగా నిజాం, మునిరామయ్య, మునిరాజులు నియమితులయ్యారు. వీరిని గురువారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కుప్పం ఇన్‌చార్జ్ ఆవులగోపి ఘన ంగా సత్కరించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ తమపై నమ్మకంతో పదవులు కేటాయించిన అధిష్టానంకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు మునస్వామి, నంజుండప్ప, కృష్ణప్ప, ఎస్సీ సెల్ అధ్యక్షులు నాగరాజు, మునికుట్టి పాల్గొన్నారు.

## కొత్తపేటలో రోడ్డు విస్తరణకు భూమిపూజ

కుప్పం, జూలై 16 ప్రభాతవార్త



సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో కుప్పం కొత్తపేటలో నలభై అడుగుల మేర రోడ్డు విస్తరణకు కడ సభ్యుడు రాజ్‌కుమార్, మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, రెస్కోచైర్మన్ ప్రతాప్, క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్, కొత్తపేట ఇన్‌చార్జ్ అప్పు తదితరులు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక కొత్తపేట శ్రీ పెద్దపల్లి గంగమ్మ ఆలయం పక్క నుంచి నూతనంగా నిర్మించే ఆర్డీఓ కార్యాలయం వరకు నలభై అడుగుల లింక్ రోడ్డు విస్తరణ పనులు తొలుత చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పోరేషన్ డైరెక్టర్ తిరుమగళ్, టిఎన్ఎస్ఎఫ్ ఉపాధ్యక్షుడు మునెప్ప, మాజీ సర్పంచ్ మణి, చిరువ్యాపారుల సంఘం అధ్యక్షుడు మంజు, యువనేత హర్షధర్మతేజ, నేతలు సుకుమార్, లోకేష్, మురళి, రాహుల్, తాండవ, కృష్ణన్, ఉదయ్‌కుమార్, సుధాకర్, హరినాథ్ గౌడ్, కృష్ణన్, మురళి, జయరాంనాయుడు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే సిఎం చంద్రబాబు ధ్యేయం

– పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు



కుప్పం, జూలై 16 ప్రభాతవార్త

రైతుల సంక్షేమమే సిఎం చంద్రబాబునాయుడు ధ్యేయమని పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు పేర్కొన్నారు. గురువారం మండలంలోని చెక్కునత్తం పంచాయతీలో రైతులకు రాయితీతో యూరియా పంపిణీని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రైతులకు ఎరువులు, విత్తనాలు రైతు సేవా కేంద్రాల ద్వారా అందిస్తున్నట్లు చెప్పారు. కుప్పం ప్రాంతంలో రైతుల కోసం కృష్ణాజలాలు తెచ్చిన అపరభగీరథుడు సిఎం చంద్రబాబేనన్నారు. ఇప్పటికే 110 చెరువులు కృష్ణాజలాలతో నింపారన్నారు. మిగతా చెరువులు కూడా నింపడం జరుగుతుందన్నారు. రైతులు ప్రభుత్వ పథకాలు, రాయితీలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం చెందాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, కార్పోరేషన్ డైరెక్టర్లు మణి, శరవణ, వేణుగోపాల్, మాజీ సర్పంచ్ డాక్టర్ వెంకటేష్, రెస్కో డైరెక్టర్లు మురళి, ఆర్ముగం, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు శ్రీనివాసులు, కన్నన్, తెలుగుయువత అధ్యక్షుడు కనకరాజు, పార్టీ అధ్యక్షుడు బీరప్ప, రైతులు పాల్గొన్నారు.

## 28కోట్లతో జూనియర్ కాలేజ్ నిర్మాణంకు స్థల పరిశీలన

కుప్పం, జూలై 16 ప్రభాతవార్త



సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో మల్లానూరు ప్రాంతంలో ప్రభుత్వ జూనియర్ కాలేజ్ భవనాల నిర్మాణంకు ఇదివరకే 28కోట్ల నిధులు మంజూరైన విషయం విదితమే. గురువారం ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, సిఎం పిఎ శ్రీకాంత్, తహశీల్దార్ రమేష్‌బాబు, టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, ఎపిఐఐసి డైరెక్టర్ ప్రేమ్‌కుమార్,కడ సభ్యుడు రామచంద్ర తదితరులు స్థల పరిశీలన చేశారు. ఆవులనత్తం సర్కిల్ వద్ద ఉన్న భూమిని పరిశీలించారు. ఈసందర్భంగా వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ చొరవతో కుప్పం ప్రాంతంలో విద్యారంగం మరింత బలోపేతం అవుతోందన్నారు. జూనియర్ కాలేజ్ ఏర్పాటుతో మల్లానూరు పరిసర ప్రాంతాల విద్యార్థులకు స్థానికంగానే నాణ్యమైన విద్య చేరువ అవుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి డాక్టర్ వెంకటేష్, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, తెలుగుయువత అధ్యక్షుడు కనకరాజు, పిఎసిఎస్ ఛైర్మన్ కృష్ణమూర్తి, డైరెక్టర్ అన్నాదొరై, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## పేదలపాలిటి పెన్నిధి సిఎం చంద్రబాబు

–టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్

కుప్పం, జూలై 16 ప్రభాతవార్త



సిఎం చంద్రబాబునాయుడు పేదల పాలిటి పెన్నిధి అని టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్ పేర్కొన్నారు. గురువారం రాగిమానుమిట్ట గ్రామంలో లబ్దిదారుడికి మంజూరైన 26వేల సిఎంఆర్ఎఫ్ చెక్కును ఆయన పంపిణీ చేశారు. బాధితులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జ్ శివకుమార్, పంచాయతీ అధ్యక్షుడు రిజ్వాన్, బూత్ ఇన్‌చార్జ్ అక్మల్, రవి, సైదుల్లా, మహ్మద్ సబి తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## టీచర్ల సీనియార్టీ జాబితాలో సవరణలు

– డిఇఓ ఎం.వెంకటేశ్వరరావుకు యుటిఎఫ్ నాయకులు ప్రాతినిధ్యం

చిత్తూరు, జులై 16 ప్రభాతవార్త:



జిల్లా విద్యాశాఖ క్యాడర్ల వారీగా విడుదల చేసిన ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాలో అనేక సవరణలు వున్నాయని, ఈ సవరణలకు సంబంధించి ఉపాధ్యాయులు ఇచ్చిన అభ్యర్థనల ఆధారంగా పరిశీలించి పరిష్కరించాలని చిత్తూరు ఉమ్మడి జిల్లా యుటిఎఫ్ నాయకులు గురువారం డిఇఓ ఎం. వెకటేశ్వరరావును కలిసి విన్నవించింది. డిఇఓ కార్యాలయంలో డిఇఓ వెంకటేశ్వరరావును కలిసిన యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ పదోన్నతి తీసుకుని అనివార్య కారణాలతో పదోన్నతి నిరాకరించిన ఉపాధ్యాయుల సీనియార్టీని రివర్షన్ తేదీ నుండి కాకుండా వాళ్ళ పూర్తి సర్వీసును సీనియార్టీని లెక్కించాలని కోరారు. అలాగే కొంతమంది అంతర్ జిల్లా బదిలీల కింద రాకపోయినప్పటికీ అంతర్ జిల్లా బదిల్లులు కింద వున్నాయని, అలాగే కొంతమంది అంతర్ జిల్లాల బదిలీలు పొందినప్పటికీ వారు అంతర్ జిల్లాల బదిలీల్లో లేరని తెలిపారు. అలాగే ఏప్రిల్‌లో మొదటిసారి సీనియార్టీ జాబితా విడుదలైనప్పటికీ ఇప్పటి వరకు ఎన్నిసార్లు అప్పీళ్ళు ఇచ్చినప్పటికీ అదే తప్పులు పునరావృతం అవుతున్నాయని వాటిని సరిదిద్దాలని కోరారు. అలాగే వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌లకు సంబంధించి ఏ నిబంధనల ప్రకారం పాఠశాలల్లో అదనపు పోస్టులను నిర్ధారించారో అదే నిబంధనల ప్రకారమే ఖాళీగా వున్న పోస్టులకు అకాడెమిక్ ఇన్‌స్ట్రక్టర్‌లను నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యుటిఎఫ్ కార్యదర్శి జివి రమణ, ఎస్ఎస్ నాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మధు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డప్పనాయుడు, మణిగండన్‌లు, సహాధ్యక్షులు రెహెనా తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకంలో ఉచిత డయాబెటిక్ వైద్యశిభిరం

కాణిపాకం, జూలై 16 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానంలో చిత్తూరుకు చెందిన డాక్టర్ మోహన్ డయాబెటిక్ స్పెషల్ కేర్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిభిరాన్ని నిర్వహించారు. దేవస్థానంలో పనిచేసే సిబ్బంది, ఆలయ ఉభయదారులు, పరిసర గ్రామాలకు చెందిన ప్రజల కోసం స్థానిక ఆస్థాన మండపంలో ఈ శిభిరాన్ని ఏర్పాటు చేశారు. ఈశిభిరాన్ని ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్ ప్రారంభించారు. ఈమేరకు ఆస్పత్రి వైద్యులు రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఏఈఓ ఎస్వీ.కృష్ణారెడ్డి, ఆస్పత్రి వైద్యులు డాక్టర్ అం.జన, చైతన్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు సీఎం చంద్రబాబు భరోసా

రామకుప్పం, జూలై 16 ప్రభాతవార్త

నిరుపేదలు ఆర్థిక అభివృద్ధి చెందాలంటే సీఎం చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని రాష్ట్ర గ్రంధాలయ డైరెక్టర్ మునస్వామి, టిడిపి మండల అధ్యక్షుడు వెంకటరమణ పేర్కొన్నారు. గురువారం వెంకటేష్, భాగ్యలక్ష్మి, వెంకటమ్మ, మునికృష్ణ లకు సీఎంఆర్ఎఫ్ సహాయనిధి ద్వారా 3లక్షల 4 వేల రూపాయల చెక్కులను పంపిణీ చేశారు. పేద ప్రజలు అనారోగ్యంతో లక్షల రూపాయలను వైద్య చికిత్సలకు వేచించి ఆర్థిక ఇబ్బందులతో ఉండకూడదని సీఎం సహాయనిధి ద్వారా లక్షల రూపాయలను లద్దదారులకు అందజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సులోచన గుర్రప్ప, నేతలు రామ్మూర్తి, జయశంకర్, నాగభూషణం, రఘు, శంకరాచలం, సత్తి,కృష్ణారెడ్డి, మహేంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ గురుకుల పాఠశాల అభివృద్ధికి సహకరించండి



రామకుప్పం, జూలై 16 ప్రభాతవార్త

మండల శివార్లలోని అంబేద్కర్ గురుకుల పాఠశాల అభివృద్ధికి పరస్పర సహకారం అందించాలని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కిషోర్ కుమార్ , ఇంచార్జ్ కుమార్ సిఎం పిఎ శ్రీకాంత్ ను కోరారు. గురువారం కుప్పం టిడిపి కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఐదవ తరగతిలో ఎస్సీ 33, ఎస్టి 2, ఆరవ తరగతిలో ఎస్సీ 15, ఎస్టి 2, 9వ తరగతిలో ఎస్సీ 1 ఎస్టీ, 1 బిసి 1, పదవ తరగతిలో ఎస్సీ 4, ఎస్టి 1, బీసీ 2, ఓసి 1, ఇంటర్లో ఎస్సీ 7, ఎస్టీ 1 బిసి 2, ఓసి 1 విద్యార్థుల భర్తీకి ఖాళీగా ఉన్నాయన్నారు. కళాశాలలో పారిశుద్ధ్య కార్మికులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. మెగా ఇంజనీరింగ్ ద్వారా పాఠశాల అభివృద్ధికి మెయిల్ కంపెనీ అసోసియేషన్ నాగరాజు, శ్రీనివాస్ తో కలిసి పాఠశాల అభివృద్ధికి సహకరించాలన్నారు.

## మనడబ్బు - మనలెక్కపై అవగాహన ర్యాలీ

పలమనేరు, జూలై 16, ప్రభాతవార్త:



పలమనేరు మున్సిపల్ కార్యాలయంలో గురువారం మనడబ్బు - మన లెక్క అనే అంశంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇందుకు సంబంధించిన ఆప్‌ను మున్సిపల్ కమీషనర్ రాకేష్‌వర్మ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మెప్మా గ్రూపు మహిళల సంక్షేమం దృష్టిలో వుంచుకొని కొత్తగా మన డబ్బు - మనలెక్క ఆప్‌ను విడుదల చేశారని తెలిపారు. ఈ ఆప్‌ద్వారా మెప్మాలో సభ్యులైన మహిళలు తమ పొదుపు ఖాతాలు ఎప్పుడు ప్రారంభించారు ఇప్పటి వరకు ఎంత పొదుపు చేశారు ఎంత రుణాలు పొందారు ఎంత చెల్లించారు పెండింగులో ఎంత ఉన్నది తదితర వివరాలు తెలుసు కోవచ్చని సూచించారు. దీనివల్ల మెప్మా మహిళలకు తమ ఖాతాలపై పూర్తి స్థాయిలో అవగాహన ఉంటుందని వివరించారు. దీనిపై అవగాహన కల్పించడానికి ర్యాలీ నిర్వహించారు. ఈ ఆప్‌ను విడుదల చేసినందుకు ముఖ్యమంత్రికి మహిళలు కృతజ్ఞతలు తెలిపారు. మెప్మా సిఎంఎం బాబా, మెప్మా పిడి తదితరులు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ ఎస్సై మోహన్‌బాబుకు సిఐగా పదోన్నతి

కుప్పం, జూలై 16 ప్రభాతవార్త



కుప్పం ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్‌లో ఎస్సైగా పనిచేస్తున్న మోహన్‌బాబుకు ఎక్సైజ్ సిఐగా పదోన్నతి లభించింది. ఈమేరకు ఎక్సైజ్ కమీషనర్ చామకూరి శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎక్సైజ్ ఎస్సైగా మోహన్‌బాబు కదిరి, ధర్మవరం, పెత్తూరు, బద్వేలు, చిత్తూరు, కుప్పం ప్రాంతాల్లో 14 ఏళ్లు పనిచేశారు. ప్రస్తుతం సిఐగా పదోన్నతి లభించడంతో కుప్పం డికెపల్లి వద్ద ఉన్న ఖోడయ్ డిస్టలరీస్ సిఐగా నియమిస్తూ కమీషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

## ప్రజా సమస్యల పరిష్కారంకై చర్యలు

– కడ పి.డి. వికాస్ మర్మత్

– క్షేత్రస్థాయిలో పర్యటన.. భూసమస్యల పరిష్కారంకు ఆదేశం !!

కుప్పం, జూలై 16 ప్రభాతవార్త



సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో ప్రజా సమస్యల పరిష్కారంకు క్షేత్రస్థా యిలో చర్యలు చేపడుతున్నట్లు కడ పి.డి. వికాస్ మర్మత్ పేర్కొన్నారు. గురువారం ఆయన కుప్పం మండలం నూలుకుంట, రామకుప్పం మండలం బళ్ల, విజలాపురం, శాంతిపురం మండ లం శివరాంపురంలో పర్యటించారు. బళ్ల గ్రామంలో ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన గోడను పరిశీలించారు. నిబంధనల మేరకు 21రోజులు గడువు ఇచ్చి అనంతరం తదుపరి చర్యలకు రెవెన్యూ, పోలీసు అధికారులను ఆదేశించారు. అనంతరం బళ్ల –విజలాపురం మార్గంలో గ్యాస్ వినియోగదారులతో మాట్లాడారు. సిలిండర్లు పంపిణీ చేసే వ్యక్తి అదనంగా నగదు వసూలు చేయడం గుర్తించిన పి.డి. హెచ్చరి ంచారు. గ్యాస్ ఏజెన్సీ యాజమాన్యంతో సమావేశం జరపాలని అధికారులను ఆదేశించారు. అనంతరం విజలాపురంలో భూవివాదాన్ని స్థానిక ప్రజలు, అధికారులతో చర్చించి అక్కడికక్కడే పరిష్కరించారు. శివరాంపురంలో భూసమస్యను పరిశీలించి పరిష్కారంకు ఆదేశించారు. కార్యక్రమంలో కడ ఎపిడి శ్రీనివాసులు రాజు, ఆర్డీఓ షేక్ మహ్మద్ హుసేన్, కడ తహశీల్దార్ శివయ్య, స్థానిక నేతలు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## ప్రొఫెసర్ దేవప్రసాదరాజుకు రామన్ ఫౌండేషన్ జీవిత సాఫల్య పురస్కారం




### ఫిజిక్స్ రంగంలో బోధన, పరిశోధన కృషికి విశేష గుర్తింపు ఎస్వీయూ ఫిజిక్స్ ప్రొఫెసర్ దేవప్రసాదరాజుకు ప్రతిష్టాత్మక పురస్కారం

**తిరుపతి విద్య జూలై 16 ప్రభాత వార్త**

శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఫిజిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ బి దేవప్రసాదరాజు రామన్ రీసెర్చ్ ఫౌండేషన్ నుంచి జీవిత సాఫల్య పురస్కారాన్ని అందుకున్నారు. ఫిజిక్స్ రంగంలో ప్రొఫెసర్ దేవ ప్రసాదరాజు చేసిన బోధనా పరిశోధన రంగాల్లో విశేష కృషికి గుర్తింపుగా ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. తమిళనాడులోని తిరుచిరాపల్లికి చెందిన ప్రతిష్టాత్మకమైన సంస్థ రామన్ రీసెర్చ్ ఫౌండేషన్ వారి నుంచి చెన్నైలోని వేల్ టెక్ ఇంజనీరింగ్ కాలేజీ ప్రాంగణంలో గురువారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో ప్రొఫెసర్ దేవప్రసాదరాజు జీవిత సాఫల్య పురస్కారాన్ని స్వీకరించారు. ఈ పురస్కారం కింద సర్టిఫికేట్, జ్ఞాపిక, శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. ప్రొఫెసర్ దేవప్రసాద్ రాజు ఇప్పటివరకూ 126 పరిశోధన వ్యాసాలు ప్రముఖ జర్నల్స్ లో ప్రచురితమయ్యాయి. వీరు రూపొందించిన 5 రీసెర్చ్ ఆర్టికల్స్ స్కోపస్ వెబ్ సైట్ లో స్థానం సంపాదించుకున్నాయి. వీరి పర్యవేక్షణలో 13 పీహెచ్.డీలు, 2 ఎంఫిల్ డిగ్రీలు పూర్తి అయ్యాయి. అనేక జాతీయ, అంతర్జాతీయ సదస్సులూ వర్క్ షాప్ లూ నిర్వహించారు. నాలుగు ప్రతిష్టాత్మక పరిశోధన ప్రాజెక్టులను పూర్తి చేశారు. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన సైన్స్ జర్నల్స్ కు అసోసియేటర్ గాను, సమీక్షకులుగాను వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే ఎస్వీయూ టీచర్ ఎక్స్ లెన్స్ అవార్డు2024, ఇంటర్నేషనల్ సైంటిస్ట్ అవార్డ్2012 పొందారు. ప్రఖ్యాత పరిశోధన సంస్థలకు లైఫ్ మెంబర్ గానూ ఉన్నారు. యూనివర్సిటీ హాస్టల్ వార్డెన్ గా, యూనివర్సిటీ శాస్త్ర ఉపకరణ కేంద్రం డైరెక్టర్ గా, అడ్మిషన్స్ విభాగ జాయింట్ డైరెక్టర్ గా, గవర్నర్ కార్యాలయానికి ఎస్వీయూ తరఫున లైజన్ ఆఫీసర్ గా, ఏపీ రీసెట్ కన్వీనర్ గా , ఏపీ పీజీ సెట్ కో కన్వీనర్ గా తదితర బాధ్యతలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో రామన్ రిసెర్చ్ ఫౌండేషన్ నుంచి జీవిత సాఫల్య పురస్కారాన్ని అందుకోవడం గమనార్హం. ఈ సందర్భంగా రామన్ రీసెర్చ్ ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఏటీ రవిచంద్రన్ కే రవిచంద్రన్ తో పాటు ఎస్వీ యూనివర్సిటీ అధికారులు, అధ్యాపకులు అభినందించారు.

## ఆన్‌లైన్ దరఖాస్తుదారులకే టీటీడీ స్పాట్ అడ్మిషన్లు

### జూలై 23, 24న టీటీడీ స్పాట్ కౌన్సెలింగ్

**తిరుపతి విద్య జూలై 16 ప్రభాత వార్త**

తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలోని శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాల, శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాలల్లో 2026-27 విద్యా సంవత్సరానికి ప్రథమ సంవత్సరం ఇంటర్మీడియట్ ప్రవేశాల కోసం జూలై 23, 24 తేదీల్లో స్పాట్ అడ్మిషన్ల కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు టీటీడీ ప్రకటించింది. ఆన్‌లైన్‌లో ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మాత్రమే ఈ కౌన్సెలింగ్‌లో పాల్గొనే అవకాశం ఉంటుందని, దరఖాస్తు చేయని వారికి ప్రవేశం కల్పించబోమని స్పష్టం చేసింది. స్పాట్ అడ్మిషన్లకు టీటీడీ ఉద్యోగుల పిల్లలు, టీటీడీ ఎస్వీ బాలమందిర్ విద్యార్థులు, మొదటి నుంచి ఆరో దశ కౌన్సెలింగ్ వరకు హాజరు కాలేకపోయిన అభ్యర్థులతో పాటు తిరుపతి స్థానికులు, స్థానికేతర అభ్యర్థులు అర్హులని తెలిపింది. మెరిట్ ఆధారంగా ఆఫ్‌లైన్ విధానంలో కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లను కేటాయించనున్నారు. జూలై 23న ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 550-600 మార్కులు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు 500-549 మార్కులు సాధించిన విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. జూలై 24న ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 450-499 మార్కులు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు 400-449 మార్కులు సాధించిన అభ్యర్థులకు కౌన్సెలింగ్ ఉంటుంది. అభ్యర్థులు నిర్ణీత తేదీ, సమయానికి సంబంధిత కళాశాలకు అన్ని ఒరిజినల్ విద్యార్హత ధ్రువపత్రాలు, అవసరమైన ఇతర పత్రాలతో హాజరుకావాలని టీటీడీ సూచించింది. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరింది.

## ఎస్వీయూ రెక్టార్ పదవికి దళితుడినే నియమించాలి

### దళిత విద్యార్థి సంఘాల జేఏసీ డిమాండ్



**తిరుపతి విద్య జూలై 16 ప్రభాత వార్త**

శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో రెక్టార్ పదవికి దళిత వర్గానికి చెందిన అర్హుడిని నియమించాలని దళిత విద్యార్థి సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం ఎస్వీయూ గ్లాస్ హౌస్ వద్ద రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి ఏకగ్రీవ తీర్మానం చేసింది. ఈ సందర్భంగా సీనియర్ దళిత నాయకుడు జయరాం, మాజీ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు రాపూర్ ప్రసాద్ బాబు మాట్లాడుతూ, రాజ్యాంగ స్ఫూర్తి, సామాజిక న్యాయం ప్రతిబింబించేలా విశ్వవిద్యాలయ ఉన్నత పదవుల్లో దళితులకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. దళితుడిని రెక్టార్‌గా నియమించడం ద్వారా సమానత్వం, సామాజిక న్యాయం మరింత బలోపేతం అవుతాయని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం, విశ్వవిద్యాలయ పాలకులు వెంటనే ఈ డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకోవాలని, లేనిపక్షంలో దశలవారీగా ప్రజాస్వామ్యబద్ధమైన ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ పరిశోధక విద్యార్థి సంఘం అధ్యక్షుడు మురళీకృష్ణ, మాదిగ జనసైన్యం నాయకుడు సుధాకర్ మాదిగ, భారతీయ దళిత విద్యార్థి సేన అధ్యక్షుడు యుగంధర్, అఖిల భారత అంబేద్కర్ సేనకు చెందిన ప్రభు, ఎంవీఎఫ్ కృష్ణ, వినుత, ప్రవీణ్, కేఎం అర్జున్, శివకుమార్, అశోక్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో చట్టాలపై అవగాహన పెంపే లక్ష్యం

**తిరుపతి విద్య జూలై 16 ప్రభాత వార్త**




యువత నేరాల బారిన పడకుండా, బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలంటే విద్యార్థి దశ నుంచే చట్టాలపై సమగ్ర అవగాహన అవసరమని తిరుపతి మహిళా పోలీసు శక్తి టీం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తమీమ్ మహమ్మద్ అన్నారు. గురువారం శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రస్తుతం సైబర్ నేరాలు వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో డిజిటల్ అరెస్ట్ పేరుతో జరుగుతున్న మోసాలు, లోన్ యాప్‌లు, ఆన్‌లైన్ ఉద్యోగాల పేరుతో మోసాలు, ఫిషింగ్ లింకులు, తెలియని వీడియో లింకులను క్లిక్ చేయడం వల్ల కలిగే ఆర్థిక, వ్యక్తిగత నష్టాలపై విద్యార్థులకు వివరించారు. సైబర్ నేరాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. సామాజిక మాధ్యమాలైన ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి వేదికలను నిరక్ష ్యంగా వినియోగించడం వల్ల ఎదురయ్యే ప్రమాదాలు, సెల్‌ఫోన్ అధిక వినియోగం ప్రభావం, ర్యాగింగ్, మత్తు పదార్థాల వినియోగం, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన, పోక్సో చట్టం, చైల్డ్ పోర్నోగ్రఫీ కేసుల్లో ఉండే కఠిన శిక్షల గురించి కేస్ స్టడీలతో సహా వివరించారు. అలాగే శక్తి యాప్, పోలీస్ హెల్ప్‌లైన్-112, డ్రగ్స్ టోల్ ఫ్రీ-1972 సేవలను అవసరమైన సందర్భాల్లో వినియోగించుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ సి. ప్రకాష్ బాబు మాట్లాడుతూ విద్యార్థులు సమాజంలో చోటుచేసుకుంటున్న మార్పులను గమనిస్తూ స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణతో ముందుకు సాగాలని చెప్పారు. సెల్‌ఫోన్లను విద్యా అవసరాలకు మాత్రమే వినియోగిస్తూ చదువుపై దృష్టి సారిస్తే జీవితంలో ఉన్నత స్థానాలు సాధించవచ్చన్నారు. కష్టపడి చదివి మంచి ఉద్యోగాలు సాధించడం ద్వారా కుటుంబ ఆర్థిక పరిస్థితిని మార్చే శక్తి విద్యార్థులకే ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు మీనాక్షి , పూర్ణిమ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వేము ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఏఐ ఆధారిత వ్యవసాయం పై అవగాహన సదస్సు

**పూతలపట్టు, జూలై 16, ప్రభాతవార్త**

పి. కొత్తకోటలోని వ్యవసాయ రంగంలో కృత్రిమ మేధస్సు వినియోగం, డిజిటల్ సాంకేతికతల ప్రాధాన్యం, రైతులకు అందుబాటులో ఉన్న ఆధునిక పరిష్కారాలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో వేము ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఏఐ ఆధారిత వ్యవసాయం అంశంపై ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్టాక్లీ సంస్థ వ్యవస్థాపకుడు, సీఈఓ కావ్యాంత్ మునగాల ముఖ్య వక్తగా పాల్గొని, ఏఐ సాంకేతికత ద్వారా వ్యవసాయ రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులను వివరించారు. పంటల ఆరోగ్యాన్ని గుర్తించడం, వాతావరణ సమాచార విశ్లేషణ, నీటి వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహించడం, ఎరువుల వినియోగాన్ని ఆప్టిమైజ్ చేయడం, దిగుబడి అంచనా, మార్కెట్ ధరల విశ్లేషణ వంటి అంశాల్లో ఏఐ ఎలా రైతులకు ఉపయోగపడుతుందో వివరించారు. అలాగే, వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు, నిల్వ, రవాణా, మార్కెటింగ్ వంటి ప్రక్రియలను ఏఐ ఆధారిత డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించవచ్చని తెలిపారు. విద్యార్థులు వ్యవసాయ రంగ సమస్యలకు సాంకేతిక పరిష్కారాలను అభివృద్ధి చేయాలని, స్టార్టప్‌ల ద్వారా దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. వేము ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డా. నవీన్ కిలారి మాట్లాడుతూ, ఏఐ, డేటా అనలిటిక్స్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాల్లో విద్యార్థులను తీర్చిదిద్దేందుకు కళాశాల నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఏఐసిటిఈ ఐడియా ల్యాబ్, పరిశ్రమలతో భాగస్వామ్యాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు ప్రత్యక్ష అనుభవాన్ని అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, వివిధ శాఖల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని, ఏఐ ఆధారిత వ్యవసాయంపై ఆసక్తికరమైన చర్చలు నిర్వహించారు. కార్యక్రమం విద్యార్థులకు

## వెంకటమునిశెట్టి స్మారక బస్ షెల్టర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే ఆరణి



**తిరుపతి విద్య జూలై 16 ప్రభాత వార్త**

తుడా తొలి చైర్మన్ స్వర్గీయ వెంకటమునిశెట్టి జ్ఞాపకార్థం ప్రకాశం రోడ్డులో ఆయన మనవడు పురంధర్ నిర్మించిన బస్ షెల్టర్‌ను తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ, వెంకటమునిశెట్టి ప్రజాసేవకు అంకితభావంతో, విలువలతో కూడిన రాజకీయాలు చేసిన నాయకుడిగా గుర్తుండిపోతారని అన్నారు. ఆయన తనయుడు మునిరత్నం శెట్టి కూడా మున్సిపల్ చైర్మన్‌గా నగరాభివృద్ధికి విశేష సేవలందించారని కొనియాడారు. తిరుపతి అభివృద్ధిలో వారి కుటుంబం చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా కుటుంబ సభ్యులు నిర్మించిన బస్ షెల్టర్ ఆదర్శప్రాయమని అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మోహన్, బ్యూటీ అండ్ గ్రీనరీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ సుగుణమ్మ, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి, శ్యాప్ చైర్మన్ రవి నాయుడు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జేబీ శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్‌రాయలు, తుడా మాజీ చైర్మన్ ఎన్వీ ప్రసాద్, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు పోకల అశోక్ కుమార్, గంగమ్మ గుడి చైర్మన్ మహేష్ యాదవ్, మాజీ డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, ఏపీ అర్బన్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ డైరెక్టర్ వూకా విజయ్ కుమార్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్లు వరప్రసాద్, తోట వాసు, మాజీ కార్పొరేటర్లు, టీడీపీ, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి పురవీధుల్లో వైభవంగా జగన్నాథుని రథయాత్ర

**తిరుపతి విద్య జూలై 16 ప్రభాత వార్త**



జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలోని ఉత్కళ పీఠం పరిధిలో ఉన్న శ్రీ జగన్నాథ మందిరంలో గురువారం జగన్నాథుని రథయాత్రను అత్యంత వైభవంగా నిర్వహించారు. పూరి జగన్నాథ రథయాత్ర సంప్రదాయాన్ని అనుసరిస్తూ నిర్వహించిన ఈ ఉత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ముందుగా జగన్నాథ మందిరంలో ప్రత్యేక పూజలు, వైదిక క్రతువులు నిర్వహించిన అనంతరం శ్రీ జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రాదేవి ఉత్సవ విగ్రహాలను రథంపై ప్రతిష్ఠించి తిరుపతి పురవీధుల్లో శోభాయాత్రగా ఊరేగించారు. భక్తులు భజనలు, కీర్తనలతో రథయాత్రలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొ. జి.ఎస్.ఆర్. కృష్ణమూర్తి మార్గదర్శకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో అకాడమిక్ డీన్ ప్రొ. రజనీకాంత్ శుక్ల, రిజిస్ట్రార్ కడియం వెంకటనారాయణరావు, ఇన్‌చార్జి ఫైనాన్స్ ఆఫీసర్ ప్రొ. రాధాగోవింద త్రిపాఠి, డీన్ ఆఫ్ స్టూడెంట్స్ వెల్ఫేర్ ప్రొ. దక్షి ణామూర్తి శర్మ, ఒడిశా చైర్ అడ్వైజర్ ప్రొ. జి. శంకరనారాయణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొ. రమాకాంత్ మిశ్ర, ఒడిశా చైర్ డైరెక్టర్ ప్రొ. భారతభూషణ్ రత్, సమన్వయకర్తలు డా. సుదాంశు శేఖర్ మహాపాత్ర, డా. తపన్ కుమార్ గడై పాల్గొన్నారు. అలాగే విశ్వవిద్యాలయ అధ్యాపకులు, విద్యార్థులు, ఉద్యోగులు, తిరుపతి నగర ప్రజలు, ఇస్కాన్ భక్తులు పెద్ద సంఖ్యలో రథయాత్రలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

## బాధితుల ఫిర్యాదులను సత్వర మే పరిష్కరించండి: సిఐ



**పాలసముద్రం, జూలై 16 ప్రభాతవార్త**

మండలంలోని పోలీస్‌స్టేషన్‌ను గురువారం కార్వేటినగరం సర్కిల్ సిఐ హనుమంతప్ప పరిశీలించి రికార్డులను తనిఖీచేశారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు పోలీసులు అందుబాటులో ఉండి ఫిర్యాదు చేయడానికి వచ్చిన వారిని గౌరవించి వారికి న్యాయం చేయాలి అని స్థానిక ఎస్సైకి సూచించారు. ప్రజలు తమ సమస్యలపై పోలీస్ స్టేషన్లో ఇచ్చే ఫిర్యాదులపై వెంటనే సత్వర న్యాయం చేసి ఆదుకోవాలని సీఐ ఎర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు అందుబాటులో ఉండి వివిధ నేరాలపై అవగాహన కల్పించాలని కోరారు. ప్రజలతో ఫ్రెండ్లీ పోలీసులుగా ఉండి సేవలందించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై రాజశేఖర్, ఎస్ఆర్‌పురం ఎస్ఐ సుమన్ పాల్గొన్నారు.

## ఎస్వీయూలో జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ



**తిరుపతి విద్య జూలై 16 ప్రభాత వార్త**

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం కేంద్ర గ్రంథాలయం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న మూడు రోజుల జాతీయ సదస్సుకు సంబంధించిన బ్రోచర్‌ను యస్వీయూ ఉపకులపతి ఆచార్య టాటా నరసింగరావు, రెక్టార్ ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు గురువారం సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పరిశోధకులు, అధ్యాపకులు, గ్రంథాలయ శాస్త్ర నిపుణులకు జాతీయ సదస్సు విజ్ఞాన వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. సదస్సులో దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన నిపుణులు, పరిశోధకులు పాల్గొని గ్రంథాలయ శాస్త్రంలో వస్తున్న మార్పులు, సాంకేతిక పరిజ్ఞానం, నూతన ధోరణులపై పరిశోధనా పత్రాలు సమర్పించనున్నట్లు తెలిపారు. సదస్సు విజయవంతానికి అవసరమైన ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులు, నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో సదస్సు సంచాలకులు ఆచార్య సురేంద్ర బాబు, లైబ్రరీ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ ప్రశాంత కుమారి, డీన్ ఆచార్య చంద్రాయుడు, ఆచార్య అఖిల స్వతంత్రతో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

## క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 40 మందికి ఉద్యోగ ఆఫర్లు

### పాడి, పౌల్ట్రీ, పెట్ కేర్ రంగాల సంస్థల్లో ఉపాధి అవకాశాలు



**తిరుపతి విద్య, జూలై 16 ప్రభాత వార్త**

తిరుపతి పశువైద్య కళాశాలలో 2020 బ్యాచ్‌కు చెందిన బి.వి.ఎస్సి. అండ్ ఎ.హెచ్. చివరి సంవత్సరం విద్యార్థుల కోసం జూలై 15, 16 తేదీల్లో నిర్వహించిన రెండు రోజుల క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ విజయవంతమైంది. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష ్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో పాడి పరిశ్రమ, పెంపుడు జంతువుల ఆరోగ్య సంరక్షణ, కోళ్ల పరిశ్రమలకు చెందిన శ్రీజా డెయిరీ, కృష్ణా మిల్క్ యూనియన్, క్రౌన్ వెట్, వెటిక్, సంచు పెట్ క్లినిక్, ఎస్‌కేఎం ఎగ్ ప్రొడక్ట్స్ (ఈరోడ్) సహా ఏడు ప్రముఖ సంస్థలు పాల్గొని విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించాయి. మొత్తం 60 మందికి పైగా చివరి సంవత్సరం విద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరుకాగా, వారిలో సుమారు 35 నుంచి 40 మంది విద్యార్థులు వివిధ సంస్థల నుంచి ఉద్యోగ ఆఫర్లు పొందడం విశేషం. దీంతో కళాశాల నిర్వహించిన ప్లేస్‌మెంట్ కార్యక్రమం మరో విజయవంతమైన మైలురాయిగా నిలిచింది. గత మూడు సంవత్సరాలుగా కళాశాల నిరంతరంగా క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లను నిర్వహిస్తూ పశుసంవర్ధక, పాడి, కోళ్ల పరిశ్రమలు, పెంపుడు జంతువుల ఆరోగ్య సంరక్షణ రంగాల్లో విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తోందని కళాశాల యాజమాన్యం తెలిపింది. ఈ సందర్భంగా విద్యార్థులు కళాశాల యాజమాన్యానికి, పరిశ్రమల ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి కళాశాల అసోసియేట్ డీన్ డా. పి. జగపతి రామయ్య మార్గదర్శకత్వం వహించగా, ప్లేస్‌మెంట్ ఇన్‌చార్జి డా. టి.వి. చైతన్య కుమార్ సమన్వయకర్తగా వ్యవహరించారు. అధ్యాపకులు డా. యు. వినోద్, డా. సుధీర్, డా. కె. లక్ష్మీ ్మ కవిత, డా. సురేష్ సహకరించారు.

## స్కాలర్‌షిప్ అర్హుల నుంచి ఫీజులు వసూలు చేయొద్దు: ఎస్ఎఫ్ఐ




**తిరుపతి విద్య జూలై 16 ప్రభాత వార్త**

స్కాలర్‌షిప్‌కు అర్హులైన విద్యార్థులు కళాశాల ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం నేరుగా కళాశాలల ఖాతాలకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను జమ చేస్తుందని ఎస్ఎఫ్ఐ నాయకులు పేర్కొన్నారు ఈ మేరకు గురువారం శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని పలు కళాశాలల నోటీసు బోర్డులపై అవ గాహన పోస్టర్లు అతికించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు అశోక్ కుమార్, వినోద్ మాట్లాడుతూ, ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులకు విరుద్ధంగా ఎస్వీయూలోని ఐఏఎస్ఈ బీఈడీ కళాశాలలో స్కాలర్‌షిప్‌కు అర్హులైన విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ జానకిరామయ్యను కలిసి వివరణ కోరారు. దీనిపై స్పందించిన ప్రిన్సిపాల్ జానకిరామయ్య, స్కాలర్‌షిప్ రాని విద్యార్థుల నుంచి మాత్రమే ఫీజులు వసూలు చేస్తున్నామని, కొందరు సిబ్బంది పొరపాటున అర్హులైన విద్యార్థుల వద్ద కూడా ఫీజులు కోరినట్లు తెలిసిందని తెలిపారు. దీనిపై సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఎస్ఎఫ్ఐ నాయకులు తమ ఆందోళనను విరమించారు.

## పేద విద్యార్థినిలకు ప్రాధాన్యం ఇవ్వాలి: టీటీడీ చైర్మన్



**తిరుపతి విద్య జూలై 16 ప్రభాత వార్త**

టీటీడీతిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలోని శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాలను టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు గురువారం సందర్శించి విద్యా ప్రమాణాలు, వసతి సౌకర్యాలు, ప్రవేశాల పరిస్థితిపై సమగ్రంగా సమీక్షి ంచారు. పాలక మండలి సభ్యుడు భాను ప్రకాష్ రెడ్డి ఆయన వెంట ఉన్నారు. కళాశాల అభివృద్ధిపై డీఈఓ డి. పని కుమార్ నాయుడు, ప్రిన్సిపాల్ డా. సి. భువనేశ్వరి సమగ్ర నివేదికను చైర్మన్‌కు వివరించారు. పబ్లిక్ పరీక్షల్లో కళాశాల 97 శాతం ఉత్తీర్ణత సాధించడంపై బీఆర్ నాయుడు సంతృప్తి వ్యక్తం చేశారు. కళాశాల ప్రతిష్ఠ పెరగడంతో ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సు లేఖలు అధికంగా వస్తున్నాయని తెలుసుకుని, అందుబాటులో ఉన్న సీట్ల మేరకు పేద విద్యార్థినులకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. అవసరమైతే మరో మహిళా జూనియర్ కళాశాల ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. కళాశాలలో విద్యార్థినుల కోసం సెమినార్ హాల్, హాస్టల్‌లో మహిళా వైద్య నిపుణురాలి సేవలు, అంబులెన్స్, సోలార్ వాటర్ హీటర్లు, ప్రతి బ్లాక్‌లో తల్లిదండ్రులతో మాట్లాడేందుకు ల్యాండ్‌లైన్ సదుపాయం, పరిశుభ్రత సిబ్బంది నియామకం వంటి అవసరాలపై చర్చించారు. అలాగే ఈఏపీసెట్, నీట్, క్లాట్ తదితర పోటీ పరీక్షలకు శిక్షణ, మారుతున్న విద్యా అవసరాలకు అనుగుణంగా కొత్త కోర్సుల ప్రారంభంపై ఆరా తీశారు. అనంతరం కళాశాల వద్ద విద్యార్థినుల తల్లిదండ్రులతో మాట్లాడిన చైర్మన్, మెరిట్ సాధించినప్పటికీ హాస్టల్ సదుపాయం లభించని విద్యార్థినులకు వీలైనంత త్వరగా వసతి కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. డే స్కాలర్ విద్యార్థినులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థినులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలపై వెంటనే నివేదిక సమర్పించి, పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ డీఈఓ డి. పని కుమార్ నాయుడు, పాలక మండలి సభ్యులు పనబాక లక్ష్మి ్మ, భాను ప్రకాష్ రెడ్డి, ఇంజినీరింగ్ అధికారులు దామోదర్, ఉదయ్, కళాశాల అధ్యాపకులు, హాస్టల్ వార్డెన్, సిబ్బంది పాల్గొన్నారు.

## పదవులు శాశ్వతం కాదు పార్టీనే ముఖ్యం



**కేవీబీ పురం, జూలై 16 ప్రభాతవార్త:**

పదవులు వస్తుంటాయి... పోతుంటాయి... శాశ్వతంగా నిలిచేది పార్టీ మాత్రమేనని నియోజకవర్గ టీడీపీ కార్యక్రమాల సమన్వ యకర్త శంకర్‌రెడ్డి అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు మునస్వామి యాదవ్ అధ్యక్షతన నాయ కులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పంచాయతీల్లో నెలకొన్న సమస్యలపై వినతులు స్వీకరించారు. అనంతరం వగత్తూరు నుంచి వైసీపీ కార్యకర్తలు పార్టీలో చేరారు. అలాగే ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహాయాదవ్, మునస్వామి

# శ్రీకాళహస్తి డివిజన్

## నేటి నుంచి ధర్మరాజుల స్వామి... ప్రధాన ఉత్సవాలు



శ్రీకాళహస్తి, జూలై 16 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి ఉత్సవాలను శుక్రవారం నుంచి ప్రారంభమౌతాయని ఆలయ ఇఒ బికె వెంకటేశులు గురువారం తెలిపారు. ఇప్పటికే భారత పఠనం జరుగుతుంది. శుక్రవారం నుంచి ప్రధాన ఉత్సవాలు ప్రారంభమౌతాయని వివరించారు. శుక్రవారం సాయంత్రం 4గంటల నుంచి అంకురార్పణ జరుగుతుందని తరువాత ధ్వజారోహణం ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. అలాగే మధ్యాహ్నం భారత పఠనం రాత్రి భోగాతం కళాకారులచే ప్రదర్శనలు జరుగుతాయని తెలిపారు. పది రోజుల జరిగే ఉత్సవాల్లో వచ్చే శుక్రవారం నుంచి అర్జున తపస్సు నిర్వహించనున్నట్లు వివరించారు. ఏర్పాట్లును పర్యవేక్షించుటకు డెప్యూటీ ఇఒ కృష్ణారెడ్డి ఎఇఒ హేమామాలినిలకు బాధ్యతలు అప్పగించినట్లు వివరించారు. ఇప్పటికే ఆలయ ఆవరణంతా విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశామన్నారు. నిత్య కళ్యాణం పచ్చతోరణంలా తీర్చి దిద్దామన్నారు. చలువ పందిళ్ళు వచ్చిన భక్తులు సెద తీరటానికి పందిళ్ళు ఏర్పాటు చేశామన్నారు. చెన్నై రోడ్డు నుంచి ఆలయం వరకు చలువ పందిళ్ళు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఇక్కడ ఏర్పాట్లుకు సంబంధించి ఇంజనీరింగ్ విభాగం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

**నేటి నుంచి ప్రధాన ఉత్సవాలు:**
శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో నేటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు గురువారం శ్రీకాళహస్తి ఇఒ సారధ్యంలో ఇంజనీరింగ్ బృందం పర్యవేక్షించారు. ఈ ఏడాది భక్తుల భాగస్వామ్యంతో నిర్వహించే ఉత్సవాలకు సంబంధించి శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహించారు. ఈ నేపధ్యంలో ఆలయ పరిసరాల్లో గతంలో సూచించిన మేరకు ఇంజనీరింగ్ విభాగం చేపట్టిన పనులను గురువారం పరిశీలించారు. శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లు ఏ మాత్రం పూర్తి అయ్యాయి అనే అంశాన్ని పరిశీలించారు. ఆలయ శుద్ధి, ధ్వజస్థంభం శుద్ధి కార్యక్రమాలను చేపట్టారు. అగ్నిగుండం వద్ద తోసులాట తొక్కిసలాట జరగకుండా అగ్నిగుండం వెడల్పు పనులు జరుగుతున్నాయి. ఇక్కడ వేదిక వెడల్పుకార్యక్రమాలతో పాటు భక్తులు ప్రవేశించటానికి అనుకూలంగామెట్లు ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ విభాగాన్ని ఆదేశించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని కాబట్టి ఏర్పాట్లలో ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఇక్కడ అగ్నిగుండ ప్రవేశంలో ఈ ఏడాది సుమారు పదివేల మంది పాల్గొంటారని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు అధికారులు ముందుజాగ్రత్తగా చర్యలు తీసుకోవాలని ఏర్పాట్లు చేయాలని ఇంజనీరింగ్ విభాగాన్ని ఆదేశించారు.

## నడిరోడ్డుపై వేడుకలు...పోలీసులు సీరియస్



రోడ్డుకడ్డంగా టేబుల్ ఏర్పాటు చేసిన జన్మదినోత్సవం నిర్వహించిన దృశ్యం

తొట్టంబేడు, జూలై 16 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలోని ఎస్‌వియస్ కళ్యాణ మండపం సమీపంలో కొందరు బిటెక్ విద్యార్థులు సర్వీసు రోడ్డుకడ్డంగా టేబుల్స్ ఏర్పాటు చేసుకొని జన్మదిన వేడుకలు నిర్వహించటం బాధాకరమని టూటౌన్ సిఐ నాగరాజు అన్నారు. గురువారం వారికి చైతన్య పరుస్తూ బాధ్యతాయుతమైన ప్రవర్తనే, నిజమైన వేడుక అని ఆయన విద్యార్థులకు హితవు చెప్పారు. విద్యార్థులు రోడ్డుకడ్డంగా టేబుల్ వేసి కేక్ కట్ చేయటం సంబరాలు జరుపుకున్న నేపథ్యంలో రాక పోకలకు తీవ్ర అంతరాయం కల్గింది. ఈ మేరకు బాధితులు తమకు ఫిర్యాదు చేసినట్లు సిఐ నాగరాజు వివరించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఈ వేడుకలు ఇతరులకు ఆటంకం కాకూడదని, ప్రజా శాంతి భద్రతలకు భంగం కలిగించకుండా నిర్వహించుకోవాలన్నారు. రోడ్డు, సర్వీసు రోడ్డు, కూడళ్ళు, బహిరంగ ప్రదేశాలలో వ్యక్తిగత వేడుకలకు ఉపయోగించుకోకూడదని విద్యార్థులు అవగాహన కల్గి ఉండాలని సిఐ నాగరాజు సూచించారు. తల్లిదండ్రులు పిల్లలను క్రమశిక్షణలో పెంచాలని సూచించారు.

## సీనియర్ నేత వీరరాఘవరెడ్డికి పలువురు నివాళులు



బుచ్చినాయుడు కండ్రిగ, జూలై 16 ప్రభాతవార్త: సీనియర్ రాజకీయ నేత తిరుమెర్ల వీర రాఘవరెడ్డి పార్థివ దేహానికి పార్టీలు అతీతంగా పలువురు నాయకులు ప్రజలు నివాళులు అర్పించారు. మండలంలోని వెస్ట్ వరత్తూరు గ్రామానికి చెందిన తిరుమేర్ల వీరరాఘవరెడ్డి అంత్యక్రియ కార్యక్రమాలు బంధువులు అభిమానులు ఏర్పాటు చేసారు. ఆయన పార్థివ దేహానికి నివాళులు అర్పించడానికి పరిసర ప్రాంతాల ప్రజలతో పాటు పార్టీలు వైయస్సార్ సిపి నాయకులు రాజేష్, గురునాథం పలువురు నాయకులు, టిడిపికి చెందిన మండల పార్టీ అధ్యక్షులు చెంచు రామానాయుడు, కన్నయ్య నాయుడు, పలువురు అభిమానులు నాయకులు నివాళులర్పించారు పేదల పక్షాన నిలబడి రాజకీయాలు పార్టీలకు అతీతంగా ప్రజా సేవ చేసిన నాయకున్ని కోల్పోవడం బాధాకరమని మండల ప్రజలు పలువురు ఆవేదన వ్యక్తం చేశారు ఆయన రాజకీయ జీవితంలో ప్రజా సేవ కోసమే సాగించడం జరిగిందని పలువురు పేర్కొన్నారు.

## దళితులపై ఎన్నాళ్ళీ వివక్ష!



తొట్టంబేడు, జూలై 16 ప్రభాతవార్త: తరాలుగా దళితులు వివక్షకు గురవుతున్నారనీ, దళిత వాడలు సమస్యల చట్రంలో మగ్గుతున్నాయంటూ ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు అంగేరి పుల్లయ్య ఆవేదన వ్యక్తం చేశారు. తొట్టంబేడు మండలంలోని బోనుపల్లి దళితవాడలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం, ఏపీ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు సంయుక్తంగా సామాజిక శంఖారావం పేరిట పల్లె నిద్ర చేశారు. ఈ సందర్భంగా దళితులతో ముఖాముఖి సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్వాతంత్రం సిద్ధించి 80 ఏళ్ల కావస్తున్నా దళితులింకా అంటరానివారుగానే బతకాల్సి వస్తోందని పుల్లయ్య ఆవేదన వ్యక్తం చేశారు. 90 శాతం దళితవాడలు నేటికీ మౌలిక వసతుల అభివృద్ధికి నోచలేదని వాపోయారు. వ్యవసాయ కార్మిక సంఘం నేత గంధం మణి, కేవీపీఎస్ నాయకులు పెనగడం గురవయ్య, చుట్టు గురవయ్య, రాజా,గ్రామస్తులు పాల్గొన్నారు.

## తల్లికి వందనం పథకానికి రూ. 10,120 కోట్లు



శ్రీకాళహస్తి, జూలై 16 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మక ఖితల్లికి వందనం పథకం అమలుకు రూ10,120.78 కోట్ల.. బడ్జెట్‌తో పరిపాలనా అనుమతులు మంజూరు చేసిందని రాష్ట్ర టీడీపీ కార్యదర్శి మాసారపు సుబ్బయ్య వెల్లడించారు. ప్రక్రియ పూర్తి పారదర్శకంగా పంపిణీ జరుగుతుందని సుబ్బయ్య తెలిపారు.

## నిరుపేదలకు ఇంటి స్థలాల భూమి పరిశీలన



ఏర్పేడు, జులై 16 ప్రభాతవార్త: ఏర్పేడు మండలం రాజులపాలెంగ్రామంలో నిరుపేదలకు ఇంటి స్థలాల నిమిత్తం ప్రభుత్వ భూమిని తహసీల్దార్ రాజశేఖర్ గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పేదలందరికీ ఇంటి స్థలాలు అందేలా త్వరగా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏర్పేడు మండల టీడీపీ అధ్యక్షులు పేరం నాగరాజ నాయుడు, జగదీష్, రాఘవేంద్ర, చంద్రశేఖర్ నాయుడు, వెంకయ్య, కేశినేని సుబ్రమణ్యం, గుణా యాదవ్, రాచేటి సుబ్రమణ్యం, కె.కె రమణ, వై.మనోహర్ నాయుడు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

## కోడిపందేం శిబిరాలపై పోలీసుల దాడి!

తొట్టంబేడు జులై 16 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలం కంచనపల్లి గ్రామ పరిధిలోని మామిడి తోటలో జరుగుతున్న కోడిపందేలపై పోలీసులు బుధవారం దాడి నిర్వహించారు. బి.ఎన్.కండ్రిగ సీఐ లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో తొట్టంబేడు ఎస్ఐ బి బాలకృష్ణ, సిబ్బంది మధ్యాహ్నం 12.30 గంటలకు ఆకస్మిక దాడి చేశారు. పందాలు కాస్తున్న 14 మందిని అదుపులోకి తీసుకున్నారు. కొందరు పరారయ్యారు. స్వాధీనం చేసుకున్నవి 7కోడిపందెం కోళ్ళు, 40 మోటార్ సైకిళ్లు, రూ. 71,500 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై బి.బాలకృష్ణ పత్రికల వారికి తెలిపారు. ప్రాథమిక విచారణలో ప్రధాన నిర్వాహకులు శ్రీకాళహస్తి రూరల్ చెర్లపల్లికి చెందిన మల్లికార్జున, రేణిగుంట మండలం మల్లవరం గ్రామానికి చెందిన నాగరాజరెడ్డిగా గుర్తించారు. ఈ ఘటనపై తొట్టంబేడు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ కోడిపందేలు, జూదం నిర్వహించడం, పాల్గొనడం చట్టవిరుద్ధం. ఇలాంటి కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే 9440900724 / 9440796763 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

## శివయ్య సేవలో ఐటిడిపి కార్యదర్శి



శ్రీకాళహస్తి, జూలై 16 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుని సేవలో గురువారం రాష్ట్ర ఐటిడిపి కార్యదర్శి శివకృష్ణ దర్శించుకున్నారు. వారికి స్థానిక ఐటిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి ఖాదర్‌బాషా సారధ్యంలో స్వాగతం ఏర్పాటు చేసారు. ఆలయ మర్యాదలతో తీర్థ ప్రసాదాలను అందించారు. ఆయనకు స్వాగతం పలికిన వారిలో ఖాదర్‌బాషా, సుధ, గణేష్ ఉన్నారు.

## శంకరయ్యను పరామర్శించిన భూమన



శ్రీకాళహస్తి, జూలై 16 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలో నివాసముంటున్న జర్నలిస్టు వి.శంకరయ్యను శుక్రవారం విద్యావేత్త శ్వేత మాజీ డైరెక్టర్ భూమన్, శ్రీసిటి మేనేజర్ రామచంద్రారెడ్డి పరామర్శించారు. 93 సంవత్స రాల వయస్సు లోనూ మొక్కవోని చిత్తశుద్ధితో జర్నలిజంలో పని చేస్తూ సాగునీటి ప్రాజెక్టులపై సమగ్ర అధ్యయనంతో సమాచారాన్ని అందిస్తున్న వి.శంకరయ్య ఇటీవల స్వల్ప అస్వస్థతకు గురికాగా చికిత్స పొంది ఇంటిలో ఉన్నారు. అయినా ఆయన ఇప్పటికీ ప్రత్యేక వ్యాసాలు, కథనాలు వివిధ పత్రికలకు అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో సాహిత్యంపట్ల భాష పట్ల మక్కువ కల్గిన ఇద్దరు ప్రముఖులు ఆయన్ను ఆయన నివాసంలో కలసి సత్కరించారు.

## శివయ్య సేవలో సంగీత దర్శకులు



శ్రీకాళహస్తి, జూలై 16 ప్రభాతవార్త: దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి చెందిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం సంగీత స్వరబ్రహ్మ సినీ సంగీత దర్శకులు మణిశర్మ కుటుంబ సభ్యులతో వాయులింగేశ్వరుని దర్శించుకున్నారు. గురువారం వారు ఆలయానికి రాగా వారికి దక్షిణ గోపురం వద్ద ప్రోటోకాల్ ఎఇఒ లోకేష్‌బాబు, ఎపిఆర్ఓ రవిలు వేదపండితులతో ప్రత్యేక స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల అలయంలో అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. ఏర్పాట్లును దేవస్థానం ఎఇఒ విద్యాసాగర్‌రెడ్డి, టెంపుల్‌ఇ న్సె పెక్టర్ వెంకటస్వామి, పర్యవేక్షణాధికారి నాగభూషణం యాదవ్‌లు పర్యవేక్షించారు.

## పూజలు చేయించుకున్న చీప్ విప్



శ్రీకాళహస్తి, జూలై 16 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన వాయులింగేశ్వరుని సేవలో గురువారం రాష్ట్ర ప్రభుత్వ చీప్ విప్, గన్నవరం శాసనసభ్యుడు యార్లగడ్డ వెంకటరావు కుటుంబ సభ్యులతో కలసి పాల్గొని పూజలు జరిపించుకున్నారు. వారికి దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో ప్రోటోకాల్ మేరకు ఎఇఒ లోకేష్‌బాబు, ఎపిఆర్ఓ రవిలు వేదపండితులతో వేద మంత్రాలతో స్వాగతం పలికారు. ఏర్పాట్లును ఆలయ ఎఇఒ విద్యాసాగర్‌రెడ్డి, ఆలయ పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్, టెంపుల్‌ఇన్సె పెక్టర్ హరియాదవ్‌లు పర్యవేక్షించారు.

## బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించిన చైర్మెన్



శ్రీకాళహస్తి, జూలై 16 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో శుక్రవారంనుంచి ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాల ఏర్పాట్లును గురువారం రాత్రి ఆలయ చైర్మెన్ కొట్టెసాయిప్రసాద్ ప్రత్యేకంగా పర్యవేక్షించారు. బ్రహ్మోత్సవాల్లో కీలకమైన అగ్నిగుండం వేదికను క్షుణ్ణంగా పరిశీలించారు. ఇక్కడ చేపట్టిన ఏర్పాట్లు గురించి ఇంజ నీరింగ్ విభాగానికి చెందిన ఉద్యోగి ద్వారా తెలుసుకున్నారు. కాగా శుక్రవారం ప్రారంభమయ్యే ధ్వజారోహణంకు సంబంధించి ఏర్పాట్లు ముస్తాబులను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. ఇక ఆలయంలో చేపట్టిన ఏర్పాట్లును పరిశీలించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అగ్నిగుండం కార్యక్రమాలకు భారీ సంఖ్యలో జనం హాజరౌతారు కాబట్ట క్యూలైన్లను కట్టుదిట్టంగా ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. అర్జున తపస్సు సందర్భంగా జనం అధికంగా హాజరౌతారు, వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లును చేపట్టాలని సూచించారు.

## వెంకటాద్రి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే



తొట్టంబేడు, జులై 16 ప్రభాతవార్త: తొట్టంబేడు మండలం గుర్రప్ప నాయుడుకండ్రిగ గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు సింగమాల భాస్కర్, అన్న సింగమాల వెంకటాద్రి ఇటీవల స్వర్గస్తులయ్యారు. ఈ మేరకు గురువారం వారి స్వగృహానికి విచ్చేసిన శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, వెంకటాద్రి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమం లో స్థానిక టీడీపీ మండల అధ్యక్షుడు రావిళ్ళ మునిరాజు నాయుడు, 9 బూత్ యూనిట్ల ఇన్చార్జ్ లెక్కల మురళి నాయుడు, మాజీ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ జై చంద్రబాబు నాయుడు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భూసార పరీక్షపై పాఠశాల విద్యార్థులకు శిక్షణ



శ్రీకాళహస్తి జూలై 16 ప్రభాతవార్త: ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఏపీ గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల విద్యార్థులకు భూసార పరీక్ష కేంద్రం తిరుపతి, జిల్లా వనరుల కేంద్రం తిరుపతికి, శ్రీకాళహస్తి మండల వ్యవసాయ అధికారి సంయుక్తంగా, భూసార పరీక్ష ప్రాముఖ్యతపై విద్యార్థులకు శిక్షణను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భూసార పరీక్ష కేంద్రం వ్యవసాయ అధికారులు కుముదా, పుష్పావతి భూసార పరీక్ష నిర్వహించడానికి మట్టి సేకరణ విధానాన్ని, భూసార పరీక్ష కావలసిన మట్టిని సేకరించేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి వివరించారు. జిల్లా వనరుల కేంద్రం తిరుపతి వ్యవసాయ అధికారి వేణుగోపాల్, భూసార పరీక్ష యొక్క ప్రాముఖ్యత భూమి యొక్క సారమును నిలుపుకోవాల్సి న అవసరం గురించి వివరించారు. శ్రీకాళహస్తి మండల వ్యవసాయ అధికారి మమతా రెడ్డి భూసార పరీక్ష ఎందుకు నిర్వహించాలి అది ఏ విధంగా సాగు ఖర్చును తగ్గించడం వాతావరణం పరిరక్షణకు ఏ విధంగా తోడ్పడుతుందో విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 8,9 తరగతులకు చెందిన విద్యార్థులు, రాస్ కృషి విజ్ఞాన కేంద్రం ల్యాబ్ టెక్నీషియన్ ప్రియాంక, ఆత్మ బిటియం భార్గవి కళాశాలకు చెందిన ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## రెండు నెలల్లో అవిలాల బాధితుల సమస్యకు పరిష్కారం

### జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్



తిరుపతి కలెక్టరేట్, జూలై 16 ప్రభాతవార్త : అవిలాల గ్రామానికి సంబంధించిన దశాబ్దాల నాటి భూ వివాదానికి శాశ్వత పరిష్కారం చూపడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ స్పష్టం చేశారు. అవిలాల గ్రామ భూ సమస్యలపై జిల్లా కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన ప్రత్యేక సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, తిరుపతి రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) రామ్మోహన్, రెవెన్యూ, ఎండోమెంట్స్ శాఖల అధికారులు, కొచ్చి కుటుంబ ప్రతినిధులు, అవిలాల గ్రామ బాధితులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లాల్లో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను ప్రాధాన్యంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. ఆ ఆదేశాల మేరకు తిరుపతి జిల్లాలో సంవత్సరాలుగా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న భూ సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. ఎండోమెంట్స్ శాఖ నుంచి ఉత్తర్వులు వచ్చిన వెంటనే అవిలాల భూ సమస్యపై జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయి అధ్యయనం ప్రారంభించిందన్నారు. జిల్లాలో 22ఏ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని కలెక్టర్ తెలిపారు. భూములు కొనుగోలు చేసిన వేలాది మంది ప్రజలు రిజిస్ట్రేషన్, క్రయవిక్రయాలు చేయలేక ఎన్నో సంవత్సరాలుగా ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. శెట్టిపల్లి ప్రాంతంలో సుమారు 50 సంవత్సరాలుగా కొనసాగిన సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి 2,100 మంది లబ్ధిదారులకు 225 ఎకరాలపై ఇంటి స్థలాల పట్టాలు, ఉచిత రిజిస్ట్రేషన్ పత్రాలు అందించామని తెలిపారు. దామినేడు ప్రాంతంలో ప్రభుత్వ భూములను పరిరక్షిస్తూ న్యాయస్థానాల్లో ప్రభుత్వం విజయాన్ని సాధించిందన్నారు. సుమారు 100 ఎకరాల ప్రభుత్వ భూమిని అంతర్జాతీయ క్రీడా సముదాయం, జిల్లా కోర్టు సముదాయం, పర్యాటక అభివృద్ధి వంటి ప్రజా అవసరాలకు కేటాయించినట్లు వివరించారు. అదే సమయంలో దామినేడు ప్రాంతంలో 240 ఎకరాలకు సంబంధించిన మరో సమస్యపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని, సుమారు 1,400 మంది కొనుగోలుదారులకు సంబంధించిన భూములను 22ఏ నుంచి విముక్తి కల్పించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఆటోనగర్ ప్రాంతంలో కూడా 22ఏ కారణంగా ఇబ్బందులు ఎదుర్కొన్న సుమారు 500 కుటుంబాలకు ప్రభుత్వం న్యాయం చేస్తూ విముక్తి కల్పించిందన్నారు. అవిలాల భూ సమస్యపై మాట్లాడుతూ, 1884 కాలం నుంచి జరిగిన భూ లావాదేవీలు, న్యాయపరమైన అంశాలు, ప్రభుత్వ రికార్డులను సమగ్రంగా పరిశీలిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఉత్తరాది మఠం, హాథీరాంజీ మఠం, కొచ్చి కుటుంబానికి సంబంధించిన భూములపై ఎండోమెంట్స్ శాఖ మార్గదర్శకాల మేరకు సమగ్ర సర్వే నిర్వహిస్తున్నామని చెప్పారు. సుమారు 175 ఎకరాల పరిధిలో హాథీరాంజీ మఠానికి చెందిన భూములకు సంబందించిన, కొచ్చి కుటుంబానికి చెందిన భూములు సంబందించిన అంశాన్ని ఖచ్చితంగా నిర్ధారించిన తర్వాత చట్టబద్ధమైన నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. హాథీరాంజీ మఠానికి చెందిన భూములను పూర్తిగా పరిరక్షి స్తూనే, కొచ్చి కుటుంబానికి సంబంధించిన భూముల విషయంలో చట్టపరంగా 22ఏ నుంచి విముక్తి కల్పించే అవకాశాలను ప్రభుత్వం పరిశీలిస్తోందని తెలిపారు. అవిలాలలో అనేక మంది తమ జీవితకాల పొదుపులతో స్థలాలు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకున్నారని, వారి ఇబ్బందులను ప్రభుత్వం పూర్తిగా అర్థం చేసుకున్నారని, సమావేశంలో సుమారు 20 మంది బాధితులు తమ అభిప్రాయాలు వెల్లడించారని, అందరి సమస్యలను ఓర్పుతో విన్నామని తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం సంబంధిత భూముల్లో 50 శాతం హాథీరాంజీ మఠానికి, 50 శాతం కొచ్చి కుటుంబానికి చెందినవిగా గుర్తింపు ఉన్న నేపథ్యంలో అదే ప్రాతిపదికన తదుపరి చర్యలు చేపడతామని తెలిపారు. ఈ అంశంపై జిల్లా ఎస్పీతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, న్యాయపరమైన కేసులు, శాంతిభద్రతల అంశాలను సమన్వయంతో పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అవిలాల బాధితుల సమస్యను రెండు నెలల్లో పరిష్కరించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని, ఈ విషయాన్ని సభాముఖంగా హామీ ఇస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కొచ్చి కుటుంబానికి చెందిన కోచ్చి శేషగిరిరావు మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ మరియు జిల్లా యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు. 44 సంవత్సరాలుగా కొనసాగుతున్న ఈ సమస్య పరిష్కార దిశగా ప్రభుత్వం ముందుకు రావడం సంతోషకరమన్నారు. ఇది కేవలం తమ కుటుంబ సమస్య మాత్రమే కాదని, అక్కడ ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న ప్రజలు, అగ్రిమెంట్ హోల్డర్లు, తెలియక భూములు కొనుగోలు చేసి ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారందరికీ న్యాయం జరగాలని ఆకాంక్షించారు. ఎండోమెంట్స్ కమిషనర్ ఉత్తర్వులు, ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా సంబంధిత భూములను 22ఏ జాబితా నుంచి తొలగించి రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, తిరుపతి ఆర్డీఓ రామ్మోహన్, రెవెన్యూ, ఎండోమెంట్స్ శాఖల అధికారులు, అవిలాల గ్రామ బాధితులు, కొచ్చి కుటుంబ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## 500 మంది వైసీపీ కార్యకర్తలు తెలుగుదేశంలో చేరిక



నారాయణవనం, జూలై 16 ప్రభాతవార్త: సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం కుమారు టీడీపీ పార్టీ ఇన్‌చార్జి(బీఎల్ఏ) కోనేటి సుమన్ కుమార్ సమక్షంలో భారీగా వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీ పార్టీలో చేరారు. నారాయణవనం మండలంలోని మండల కేంద్రంలోని శ్రీ దుండి వినాయకుని ఆలయ ఆవరణలో గురువారం సాయంత్రం 4 గంటలకు సుమారు 500 మందికిపైగా వైసీపీ నాయకులు, కార్యకర్తలు సత్యవేడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి కోనేటి సుమన్ కుమార్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ఎడ్‌క్యాఫ్ చైర్మన్ ఆర్‌డీ ఏకాంబరం సమక్షంలో తెలుగుదేశం పార్టీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం పట్ల ఆకర్షితులై తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరందరిని పార్టీ కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. చేరిన వారిలో కశింమిట్ట, వెత్తలతడుకు, నారాయణవనం, బ్రాహ్మణతాంగేళ్ వడ్డిండ్లు పంచాయతీ మాజీ రామమూర్తి, మాజీ ఉప సర్పంచ్ కంబుకుట్టి ఆర్ముగం, వెత్తలతడుకు మాజీ రేషన్‌డీలర్‌శ్రీనివాసులు, శంకర్ మొదలియార్, సోడా మణిరెడ్డిలు తన భారీ అనుచరులతో కలసి వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు రమేష్‌బాబు, కె.సుధాబాబు, డి.ఆర్ముగం, కసింమిట్ట ఎల్.గోపి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ టి.ఊరప్ప, మాణిక్యం రెడ్డి, అచ్చుకట్ల హరి, బి.ఎం.నరేష్, టి.సుబ్రహ్మణ్యం, బాల మురుగన్, బాలయ్య,దేవరాజులు, శివలింగం, నాగయ్య, రమేష్, చీరాలయ్య, రాజేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.